వంట.. ధరల మంట..!

- ఆకాశాన్నంటుతున్న నిత్యావసరాల ధరలు
- పెరగని మెనూ చార్జీలు
- ఆర్థిక ఇబ్బందుల్లో మధ్యాహ్న భోజన నిర్వాహకులు
- కూటమి ప్రభుత్వానికి కొరవడిన చిత్తశుద్ధి

కొత్తపేట: విద్యార్థుల హాజరు శాతం పెంచేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకానికి నిత్యావసర ధరలు మంట పుట్టిస్తున్నాయి. పెరుగుతున్న ధరలకు తగ్గట్టుగా ప్రభుత్వం బడ్జెట్ పెంచకపోగా, నెలవారీ బిల్లులు సైతం సక్రమంగా ఇవ్వకపోవడంతో పథకం నిర్వాహకులు ఇబ్బందులకు గురవుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిత్యావసర సరకులు, కూరగాయల ధరలు విపరీతంగా పెరిగాయి. దీని ప్రభావం సామన్య ప్రజలపైనే కాదు పాఠశాలల్లో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకంపై కూడా పడింది. దీనికి తోడు మధ్యాహ్న భోజన కార్మికులకు గౌరవ వేతనాలు, ఎండీఎంకు చెల్లించాల్సిన బిల్లులు, వేతనాలు మూడు నెలల నుంచి చెల్లించడంలేదు. దీంతో విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందించేందుకు ఎండీఎం ఏజెన్సీల మహిళలు అనేక అవస్థలు పడుతున్నారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో..

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో విద్యా రంగానికి అధిక ప్రాధాన్యతనిచ్చి మెరుగైన వసతులు, సౌకర్యాలు, నాడు–నేడు పథకంలో పాఠశాలల రూపురేఖలు మార్చడంతో పాటు, మెరుగైన, నాణ్యమైన మధ్యాహ్న భోజనం మెనూతో విద్యార్థులకు మంచి పౌష్టికాహారాన్ని అందించారు. దీంతో అప్పట్లో తల్లిదండ్రులు వారి పిల్లలను ప్రభుత్వ బడులకు పంపించేందుకు ఆసక్తి చూపేవారు. విద్యార్థులు పాఠశాలల్లో ఆసక్తిగా, సంతృప్తిగా భోజనం చేసేవారు. కూటమి ప్రభుత్వానికి ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే పేద, మధ్య తరగతి విద్యార్థుల మధ్యాహ్న భోజన పథకంపై చిత్తశుద్ధి కొరవడింది. ఎండీఎంకు ప్రభుత్వం నాణ్యమైన బియ్యం సరఫరా చేయడంలేదంటున్నారు. పచ్చి బియ్యం సరఫరా చేస్తున్నారని, దీంతో అన్నం ముద్దవుతుందని ఏజెన్సీల మహిళలు తెలిపారు. ఎంత మంచి కూర వండి, వడ్డించినా ముద్దన్నంతో రుచి లేని చద్దన్నం తింటున్నట్టు ఉందని పలువురు విద్యార్థులు వాపోయారు.

ధరలు పెరిగినా పాత చార్జీలే..

ప్రస్తుతం నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగాయి. దీంతో కుకింగ్ ఏజెన్సీలకు ప్రభుత్వం ఇచ్చే నగదు సరిపోకపోవడంతో వారి అవస్థలు పడుతున్నారు. గత ప్రభుత్వంలో ఎప్పటికప్పుడు నిత్యావసరాల ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలు పెంచేవారు. దీంతో వంట ఏజెన్సీ మహిళలకు ఇబ్బంది ఉండేది కాదు. అయితే ఇప్పుడు కూటమి ప్రభుత్వం అసలు పట్టించుకోవడం లేదు. ఉల్లిపాయలు కేజీ రూ.50, వంటనూనె రూ.120 నుంచి రూ.130 ఉండేది ప్రస్తుతం రూ.180 నుంచి రూ.250 పలుకుతోంది. కందిపప్పు రూ.60 పెరిగింది. ఇక మిగిలిన అన్ని సరుకుల ధరలు గణనీయంగా పెరిగిపోయినా చార్జీలు మాత్రం పెంచలేదు. ప్రస్తుతం ప్రాథమిక పాఠశాలల్లో చదివే విద్యార్థులకు రూ 5.80. ఉన్నత పాఠశాల విద్యార్థులకు రూ.8.14 నిర్వాహకులకు అందజేస్తున్నారు. ఏజెన్సీల మహిళలకు వేతనాలు రూ 3 వేలు చొప్పున చెల్లిస్తున్నారు. ఆయా చార్జీలను రూ.8, రూ.10కి, వేతనం రూ.3వేలు నుంచి రూ.5వేలకు పెంచాలని, ప్రతి నెలా 5వ తేదీ నాటికి బిల్లులు, వేతనాలు విడుదల చేయాలని కోరారు.

క్లస్టర్‌లో ప్రభుత్వ పాఠశాలల వివరాలు

నియోజకవర్గం	స్కూల్స్	విద్యార్థుల సంఖ్య
కొత్తపేట	235	14,521
పీ గన్నవరం	291	19,500
రాజోలు	229	14,529
మొత్తం	755	48,550


కొత్తపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం తీసుకుంటున్న విద్యార్థినులు

ఖర్చు రెట్టింపు


గతేడాదికి ఇప్పటికి ధరలు బాగా పెరిగాయి. వంట ఖర్చులు రెట్టింపయ్యాయి. ఫలితంగా ఆర్థిక ఇబ్బందులు పెరుగుతున్నాయి. అలా అని మెనూలో ఎటువంటి మార్పులు చేయడం లేదు. ఆహార పదార్థాల రుచిలో తేడాలు చూపడం లేదు. దీంతో మాకు మాత్రం ఆర్థిక భారం ఎక్కువవుతోంది. ప్రభుత్వం బిల్లులు, వేతనాలు చెల్లించాలి.

– **మహేశ్వరుల సరస్వతి**, వంట ఏజెన్సీ మహిళ, కొత్తపేట

బిల్లులు, వేతనాలు చెల్లించాలి


కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చాక నిత్యావసర, కూరగాయల ధరలు నింగినంటుతున్నాయి. ధరలకనుగుణంగా పాఠశాలల్లోని కుకింగ్ ఏజెన్సీలకు విద్యార్థులకు చెల్లించే మెనూ చార్జీలు మాత్రం పెంచడంలేదు. ఇబ్బందులను గుర్తించి నిర్వాహకులు గౌరవ వేతనాలు పెంచి, కనీసం వేతనం అమలు చేయాలి.

– **యెలిశెట్టి మురళీమోహన్**, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి, కొత్తపేట

క్లుప్తంగా

సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె


అలమూరులో తహసీల్దార్ ప్రకాష్‌బాబుకు వినతిపత్రాన్ని అందజేస్తున్న 108 ఉద్యోగులు

ఆలమూరు: దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న 108 ఉద్యోగుల సమస్యలను పరిష్కరించకుంటే సమ్మె తప్పదని ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ (ఈఎంటీ) ఈ భారతి, పైలట్ పి.రాజేష్ తెలియజేశారు. రాష్ట్ర 108 ఉద్యోగుల సమాఖ్య ఆదేశాల మేరకు 108 ఉద్యోగుల ప్రతినిధులు తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ కె.జె.ప్రకాష్‌బాబుకు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. తమ సమస్యలను పరిష్కరించకుంటే ఈనెల 25న నుంచి దీర్ఘకాలిక సమ్మెలోకి దిగి తమ పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

శివాలయాల్లో అయ్యప్ప స్వాముల సందడి

మామిడికుదురు: మండల దీక్ష పూర్తి చేసుకున్న అయ్యప్ప స్వాములు ఆదివారం శివాలయాల్లో పూజలు చేశారు. అయ్యప్ప ఇరుముడులతో శివాలయాలు సందడిగా మారాయి. ఇరుముడి కట్టించుకున్న స్వాములు శబరిమల యాత్రకు బయలుదేరి వెళ్లారు. పెదపట్నంలంక ఉమాసత్యలింగేశ్వరస్వామి ఆలయం వద్ద 14 మంది, పాశర్లపూడి ఉమా చెన్నమల్లేశ్వరస్వామి ఆలయం వద్ద 20 మంది, మొగలికుదురు శివాలయం వద్ద 15 మందికి స్వాములకు ఇరుముడులు కట్టారు. గురుస్వాములు జయంతి సుబ్బారావు, కొర్లపాటి రామారావు, వర్దినేని సత్య శ్రీనివాస్ మండల దీక్ష పూర్తి చేసిన స్వాములకు ఇరుముడులు కట్టారు. ఆ ఇరుముడులతో శబరిమల బయలుదేరి వెళ్లారు.

12 మద్యం సీసాలు స్వాధీనం

రాజోలు: అంతర్వేది పల్లిపాలెంలో ఒక వ్యక్తి నుంచి 12 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామని రాజోలు ప్రొబిషన్ ఎక్సైజ్ సీఐ కె.వీరబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బెల్ట్‌షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

22న కౌలు రైతుల సదస్సు

మలికిపురం: ఈ నెల 22వ తేదీన సఖినేటిపల్లి సమతా కల్యాణ మండపంలో నిర్వహించనున్న కౌలు రైతుల జిల్లా సదస్సును విజయవంతం చేయాలని రైతు సంఘ నాయకులు కోరారు. ఆదివారం మలికిపురంలో సదస్సు విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేస్తూ నాయకులు కరపత్రాలను ఆవిష్కరించారు. అంతర్వేది లక్ష్మీ నరసింహ స్వామి, నీలకంఠేశ్వరస్వామి, రాఘవేంద్రస్వామి దేవస్థానాలకు కౌలు రైతులు సక్రమంగా శిస్తులు చెల్లిస్తున్నప్పటికీ భూములను ఖాళీ చేయమని అధికారులు నోటీసులు ఇస్తున్నారని నాయకులు అన్నారు. కౌలు రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి జిల్లా కౌలు రైతుల సదస్సు నిర్వహిస్తున్నామని, ఇందులో రాష్ట్ర నాయకులు పాల్గొంటారని వారు అన్నారు. రైతు సంఘ నాయకుడు కేశవశెట్టి, సీపీఐ నాయకుడు రాజేంద్రప్రసాద్, ఏషయ్య, టాండన్‌రాజు, బుజ్జిబాబు, ప్రభాకర్‌రావు, గంగాచలం, పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

ఆలమూరు: పినపళ్లలో ఉమెన్ డెవలప్‌మెంట్ ట్రస్టు ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయనున్నట్టు ఆసంస్థ నిర్వాహకులు బి.విద్యాప్రసన్న తెలిపారు. ఈసందర్భంగా ఆదివారం ఆమె మాట్లాడుతూ స్థానిక కల్యాణ మండపంలో ఏర్పాటు చేసే ఈ శిబిరంలో రాజమహేంద్రవరానికి చెందిన డెల్టా, శ్రీగౌతమీ నేత్రాలయం, రమా దంత వైద్యశాల, మోహన్ దయాబెటీస్ ఆస్పత్రుల వైద్యులు పాల్గొని సేవలను అందించనున్నారని తెలిపారు.

రావి, వేప చెట్లకు కల్యాణం

సఖినేటిపల్లి: కేశవదాసుపాలెంలో ఆదివారం మారెమ్మ ఆలయం వద్ద భక్తులు రావి చెట్టుకు, వేప చెట్టుకు కల్యాణం నిర్వహించారు. స్థానికులు కూన శ్రీరామమూర్తి, మహలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో కల్యాణం వేదపండితులు జరిపించారు.

అయ్యప్ప కలశ పూజ

మామిడికుదురు: మగటపల్లిలో బొలిశెట్టి సందీప్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి అయ్యప్ప స్వామి 18 కలశల పూజ వైభవంగా జరిగింది.

బీజేపీ సభ్యత్వానికి విశేష స్పందన

రాజోలు: భారతీయ జనతా పార్టీ సభ్యత్వానికి విశేష స్పందన లభిస్తుందని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీ వేమా అన్నారు. ఆదివారం రాజోలు మండల బీజేపీ కార్యవర్గ సమావేశం అడబాల రాంబాబు అధ్యక్షతన జరిగింది. రాజోలు నియోజకవర్గంలో 15 వేల మందిని సభ్యులుగా పార్టీలో చేర్చేందుకు లక్ష్యంగా నిర్ణయించామన్నారు.

క్రియాశీలక సభ్యుల సంఖ్య పెరగాలి

కొత్తపేట: బీజేపీలో క్రియాశీలక సభ్యుల సంఖ్య పెరగాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం పిలుపునిచ్చారు. ఆదివారం కొత్తపేటలో పాలూరి సత్యానందం స్వగృహం వద్ద మండల పార్టీ సమావేశం నిర్వహించారు. మండల పార్టీ ఉపాధ్యక్షుడు సబ్బవరపు సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సత్యానందం మాట్లాడుతూ ప్రపంచంలో అత్యధిక సభ్యత్వాలు కలిగిన పార్టీగా బీజేపీ గుర్తింపు పొందిందన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర యువమోర్చా అధికార ప్రతినిధి పాలూరి సత్యప్రకాష్‌నారాయణ కోటిపల్లి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించాలి

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో అర్హులైన పేద ప్రజలందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించి, ఇళ్లు నిర్మించి ఇవ్వాలని జిల్లా బీకేఎంయూ జిల్లా కార్యదర్శి కె.రామకృష్ణ, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రవి కుమార్ అన్నారు. రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర సమితి పిలుపు మేరకు సీపీఐ, బీకేఎంయూ ప్రతినిధులు ఆదివారం విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వం ఇచ్చిన ఇళ్ల స్థలాలను ప్రస్తుత కూటమి ప్రభుత్వం మూడు సెంట్లుగా పునరుద్ధరించాలన్నారు. దీనిపై సోమవారం అర్హులతో కూడిన జాబితాను రూపొందించి సంబంధిత అధికారులకు అందజేస్తామని వారు వెల్లడించారు. రాష్ట్ర ప్రజా నాట్య మండలి జిల్లా కన్వీనర్ శ్యామ్, సీపీఐ మండలశాఖ కోశాధికారి వరలక్ష్మి, ఆనంద్, రాము పాల్గొన్నారు.

నరసన్న సన్నిధిలో తెలంగాణా డీఐజీ


ఆలయంలో డీఐజీకి స్వామి చిత్రపటం ఇస్తున్న ఏసీ సత్యనారాయణ

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో ఆదివారం తెలంగాణా డీఐజీ గజరావుభోపాల్, స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద ఆయనకు అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. పూజలు అనంతరం అర్చకులు ఆశీర్వచనాలు పలికారు. స్వామివారి చిత్రపటాన్ని అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ, ఆయనకు అందజేశారు.

శివనంది అవార్డు అందుకున్న ఫొటోగ్రాఫర్


జాతీయ స్థాయిలో శివనంది అవార్డు అందుకున్న శ్రీనివాస్

సఖినేటిపల్లి: తిరుపతి జిల్లా శ్రీకాళహస్తిలో గత రెండు రోజులుగా నిర్వహించిన జాతీయ స్థాయి ఆర్ట్స్, కల్చరల్ అవార్డ్ ఫెస్ట్‌లో మండల ఫొటోగ్రాఫర్ అసోసియేషన్ అధ్యక్షుడు నల్లి శ్రీనివాస్ శివనంది అవార్డు అందుకున్నారు. ఆ వివరాలను ఆయన ఆదివారం స్థానిక మీడియాకు వివరించారు. సిటిజెన్స్ వెల్ఫేర్ ఫోరమ్, ఫ్రైడ్ ఇండియా కల్చరల్స్ సంయుక్తంగా అన్ని రకాల కళారూపాలపై ప్రదర్శనలు నిర్వహించింది. ఈ మేరకు ఫొటోగ్రఫీ విభాగంలో శ్రీనివాస్‌కు శివనంది అవార్డు దక్కింది. శ్రీనివాస్ తన విధి నిర్వహణలో ఇంత వరకూ తీసిన ఫొటోస్, పత్రికలలో ప్రచురించిన వాటి క్లిప్పింగ్స్ గత నెలలో సిటిజెన్స్ వెల్ఫేర్ ఫోరానికి సబ్‌మిట్ చేశారు. ఫొటోస్‌లలో ఉన్న వైవిధ్యం, ప్రతిభను పరిగణలోకి తీసుకుని ఫొటో గ్రఫీ విభాగంలో తనకు శివనంది అవార్డు ఇచ్చారని శ్రీనివాస్ అన్నారు. ఈ అవార్డును సిటిజెన్స్ వెల్ఫేర్ ఫోరం, ఫ్రైడ్ ఇండియా కల్చరల్స్ అధ్యక్షుడు ఎంజీ బాలాజీ, సీఈవో కోలా వెంకటేశ్వరరావు చేతుల మీదుగా అందుకున్నట్టు చెప్పారు. కాగా శివనంది అవార్డు జాతీయ స్థాయిలో తీసుకున్న శ్రీనివాస్‌కు రాజోలు తాలూకా ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ అభినందనలు తెలిపింది.

కొత్త తూరల ఏర్పాటు


మామిడికుదురులో దెబ్బతిన్న పైపు కల్వర్టును పరిశీలిస్తున్న రైతులు

మామిడికుదురు: మామిడికుదురు పంట కాలువ నుంచి ఈర్లచెరువు వెళ్లే 13వ నంబర్ పంట బోదె తూరలు పాడైపోయాయి. దీంతో నాలుగు సీజన్ల నుంచి రైతులు సాగునీటి సమస్యను ఎదుర్కొంటున్నారు. ఈ కాలువ పరిధిలో సుమారు 50 ఎకరాలు పైబడి ఆయకట్టు సాగులో ఉంది. సాగునీటి సమస్యతో నాలుగు పంటలను రైతులు త్యాగం చేశారు. ఆర్ అండ్ బీ రోడ్డు మధ్యలో ఉన్న ఈ పైప్ కల్వర్టు పూర్తిగా శిథిలమైంది. పాడైపోయిన సిమెంట్ తూరలను తొలగించి వాటి స్థానే కొత్త తూరలు ఏర్పాటు చేయాల్సి ఉండగా ఇరిగేషన్ శాఖాధికారులు చేతులెత్తేశారు. దీంతో సమస్య పరిష్కారానికి పంచాయతీ చొరవ చూపింది. సర్పంచ్ గౌస్ మొహిద్దీన్, కార్యదర్శి పీవీఆర్‌కే ప్రసాద్ పైప్ కల్వర్టుకు అవసరమైన తూరులు సమకూర్చారు. వాటిని ఆదివారం రైతులకు స్వాధీనం చేశారు. దీనిపై రైతులు గాలిదేవర రామకృష్ణ, కడలి సత్యనారాయణ, కడలి రామకృష్ణ, నయినాల సత్యనారాయణమూర్తి, కంచి దామోదరరావు, కంచి శ్రీను తదితరులు ఆనందం వ్యక్తం చేశారు. పంచాయతీ చొరవతో సమస్య పరిష్కారానికి నోచుకుందన్నారు.

వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం


బాధితుడికి సాయం అందజేస్తున్న సంస్థ సభ్యులు

రావులపాలెం: రోడ్డు ప్రమాదంలో గాయపడిన బాధితుడి వైద్యానికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు ఆదివారం రూ.12,500 చెక్కును సాయంగా అందజేశారు. గ్రామానికి చెందిన ఆవిడి వెంకన్న 15 రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో కుడి కాలికి తీవ్ర గాయం కావడంతో రాజమహేంద్రవరం ఆస్పత్రిలో ఆపరేషన్ చేశారు. పూర్తిగా కోలుకోవడానికి మరో ఆపరేషన్ చేయాలని డాక్టర్లు చెప్పారు. ఇప్పటికే అప్పు చేసి వైద్యం చేయించారు. ఆర్థిక స్థోమత లేకపోవడంతో కాశీ అన్నపూర్ణా దేవి సేవా సంస్థ సభ్యులను సాయం కోరారు. దీంతో సభ్యులు వెంకన్న ఇంటికి వెళ్లి సంస్థ సభ్యులు చేతుల మీదుగా ఆపరేషన్ నిమిత్తం రూ.12,500 చెక్కును అందజేశారు.

ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ సీజ్

పి.గన్నవరం: స్థానిక అక్విడెక్టు వద్ద ఉన్న ఇసుక ర్యాంపు నుంచి శనివారం అర్ధరాత్రి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్టు వీఆర్వో పి.నర్సింహరావు తెలిపారు. దీనిపై తహసీల్దార్ తదుపరి చర్యలు తీసుకుంటారని ఆయన వివరించారు. పి.గన్నవరం ర్యాంపు నుంచి ఇటీవల నిబంధనలకు విరుద్ధంగా పడవలపై ఇసుకను తెచ్చి ట్రాక్టర్లపై తరలిస్తుండగా అధికారులు అడ్డుకుని ఇసుకను అన్‌లోడ్ చేయించిన విషయం విధితమే. ఆ ఇసుకను అర్ధరాత్రి ఒక ట్రాక్టర్‌పై తరలిస్తుండగా అధికారులు పట్టుకుని ట్రాక్టర్‌ను సీజ్ చేశారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల అందజేత

మలికిపురం: గ్రామంలో బాధిత కుటుంబాలకు రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ ఆదివారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. మొత్తం రూ.64,173 విలువ గల చెక్కులను శంకరగుప్తంకు చెందిన కొప్పినీడి రాధాకృష్ణ, వేగివారిపాలెంకు చెందిన బత్తుల వినీత్‌లకు ఎమ్మెల్యే అందించారు. ఏపీ రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ జీ పెదకాపు, గుబ్బల ఫణి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

బాలునికి ఆర్థిక సాయం

పి.గన్నవరం: స్థానిక పితానివారిపాలెంలో అనారోగ్యంతో బాధపడుతున్న రోహిత్ అనే బాలునికి గల్ఫ్ యువనేస్తం సేవా సమితి గ్రూప్ సభ్యులు ఆదివారం రూ.25 వేల సాయం అందించారు. కార్యక్రమంలో మాజీ నెడ్‌కాప్ డైరెక్టర్ పాటి శివకుమార్, నాయకులు ప్రభాకర్, లక్ష్మణరావు, నరేంద్ర పాల్గొన్నారు.

శైవ క్షేత్రాల్లో లక్ష బిల్వార్చనలు

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న శైవక్షేత్రాల్లో ఆదివారం పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరిగాయి. అలమూరులోని పార్వతి సమేత విక్రమ భట్టేశ్వర స్వామివారి ఆలయంలో దేవదాయ, ధర్మదాయ శాఖ సారథ్యంలో వేద పండితులు లక్ష బిల్వార్చన, జ్యోతిర్లింగార్చన, కుంకుమార్చన తదితర పూజలు చేశారు. స్థానిక అయ్యప్పస్వామి ఆలయంలో అన్నాభిషేకం జరిగింది. స్థానిక దుర్గాదేవి ఆలయంలో కార్తిక దీపారాధన జరిగింది. చింతలూరు పృథ్వీశ్వరస్వామి ఆలయంలో లక్ష బిల్వార్చన జరిగింది.

అంబాజీపేట: ముక్కామలలోని బాలా త్రిపురసుందరి సమేత రాఘవేశ్వర స్వామి వారికి ఆదివారం లక్ష బిల్వార్చన వైభవంగా జరిగింది. మండల గ్రామాల్లోని శివాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

మామిడికుదురు: అప్పనపల్లి గ్రామంలో సాయి వీరభద్రస్వామి ఆలయ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అయినవిల్లి: ముక్తేశ్వరం క్షణముక్తేశ్వరస్వామివారి ఆలయంలో ఆదివారం లక్ష బిల్వార్చన పూజలు జరిపారు. స్వామికి రుద్రాభిషేకాలు నిర్వహించారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు


మామిడికుదురులో చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

సఖినేటిపల్లి: అంతర్వేదిపాలెం శాఖా గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు సందర్భంగా ఆదివారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. సీనియర్, జూనియర్ విభాగాల్లోని విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేస్తామని గ్రంథాలయ నిర్వాహకురాలు వై.వెంకటలక్ష్మి తెలిపారు.

మామిడికుదురు: గ్రామంలోని గ్రామ గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు ఏర్పాటు చేశారు. మామిడికుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు డి.లక్ష్మీనారాయణ, రిటైర్డ్ ఉపాధ్యాయుడు ఎ.శ్రీరామ్మూర్తి, గ్రంథాలయాధికారి ఎ.సూర్యనారాయణ, ఈదరాడ బీడీసీ యెరుబండి కన్నబాబు పోటీలను పర్యవేక్షించారు. విజేతలకు ఈ నెల 20వ తేదీన జరిగే ముగింపు సభలో బహుమతులు అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు.

అంబాజీపేట: విద్యార్థి దశ నుంచి పోటీ తత్వాన్ని అలవాటు చేసుకొని ఉన్నత శిఖరాలు చేరాలని రికార్డు అసిస్టెంట్ జి.శ్రీనివాస్ అన్నారు. అంబాజీపేట శాఖా గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. విజేతలకు ఈ నెల 20న స్థానిక గ్రంథాలయంలో బహుమతులు అందజేస్తామని శ్రీనివాస్ తెలిపారు.

పది ముంపు గ్రామాలకు చెక్కుల పంపిణీ

మామిడికుదురు: పి.గన్నవరం నియోజకవర్గంలోని పది గోదావరి వరద ముంపు గ్రామాలకు జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగేంద్రబాబు ఒక్కొక్క గ్రామానికి రూ.50 వేలు వంతున చెక్కులు అందజేశారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలులో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ క్యాంపు కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఈ చెక్కులు అందజేశారు. పెదపట్నంలంక, అప్పనపల్లి, పాశర్లపూడి, పాశర్లపూడిలంక, పెదపట్నం, పి.గన్నవరం మండలంలోని నాగుల్లంక, ఎల్.గన్నవరం, మొండెపులంక, పెదపూడి, ఊడుమూడి గ్రామాలకు ఈ చెక్కులు అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు తెలగారెడ్డి సూర్యప్రకాశరావు, కొనుకు ప్రేమజ్యోతి, సుందరనీడి రాజేష్‌కుమార్, గెడ్డం మంగాలక్ష్మి, గుబ్బల దుర్గ పాల్గొన్నారు.

రోటరీ అధ్యక్షుడిగా 'సోమిశెట్టి' ఏకగ్రీవ నిర్ణయం

రాజోలు: వచ్చే ఏడాది రాజోలు రోటరీక్లబ్ అధ్యక్షుడిగా ప్రముఖ వ్యాపారి సోమిశెట్టి ఆంజనేయులు ఏకగ్రీవంగా ఎన్నిక చేసేందుకు రాజోలు రోటరీ ప్రతినిధుల సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ఆదివారం జరిగిన రోటరీ కార్తిక వన సమారాధన కార్యక్రమంలో 2024–25 ఏడాదికి రాజోలు రోటరీ అధ్యక్షుడిగా సోమిశెట్టి ఆంజనేయులు, కార్యదర్శిగా నామన షణ్ముఖేశ్వరరావులను ఎన్నిక చేసేలా తీర్మానించారు.

వైభవంగా మూలేశ్వరస్వామి కల్యాణం

ఆలమూరు: మూలస్థాన అగ్రహారంలోని ఉమా సమేత మూలేశ్వర స్వామి వారి కల్యాణ మహోత్సవం ఆదివారం అత్యంత వైభవంగా జరిగింది. ఈకార్యక్రమానికి కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. బడుగువానిలంకలో జరిగిన యెరుబండి వంశీయులు ఏర్పాటు చేసిన వన సమారాధనలో పాల్గొని సంహ పంక్తి భోజనాలు చేశారు.

గ్రామాల్లో శానిటేషన్‌ను విస్మరిస్తే సహించం

- ఎమ్మెల్యే దేవ వరప్రసాద్
- మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవ

రాజోలు: గ్రామాల్లో శానిటేషన్ పనులు విస్మరిస్తే సహించేది లేదని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. ఆదివారం ఎంపీపీ కేతా శ్రీనివాస్ అధ్యక్షతన సర్వ సభ్య సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే దేవ మాట్లాడుతూ గ్రామాల్లో డంపింగ్ యార్డుల ఏర్పాటుపై దృష్టి సారించాలని గతంలోనే సూచించామన్నారు. ప్రస్తుతం ఎన్ని డంపింగ్ యార్డులు గుర్తించారనే విషయంపై నివేదిక సిద్ధం చేయాలన్నారు. ప్రతి గ్రామంలో డంపింగ్ యార్డు ఏర్పాటు చేయడం కష్టసాధ్యమని, నాలుగు, ఐదు గ్రామాలకు కలిపి డంపింగ్ యార్డు ఏర్పాటు చేసేలాఅధికారులు చొరవ చూపి స్థల సేకరణ చేయాలన్నారు. గ్రామాల్లో శానిటేషన్ చర్యలు పాటిస్తే ప్రజారోగ్యాన్ని కాపాడవచ్చునన్నారు. జెడ్పీటీసీ మట్టా శైలజ, వైస్ ఎంపీపీలు పాలమూరి శ్యాంబాబు, ఇంటిపల్లి ఆనందరాజు, ఎంపీడీఓ డి.రాంబాబు, తహసీల్దారు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహం పరిశీలన

రాజోలు: వసతి గృహాల్లో ఉంటున్న విద్యార్థులకు అండగా నిలుస్తానని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. ఆదివారం ఆయన రాజోలు బీసీ వసతి గృహాన్ని సందర్శించి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గతంలో వసతి గృహంలో విద్యార్థులు ఎదుర్కొన్న సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. ఇకపై అలాంటి సమమస్యలు రాకుండా విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని బీసీ సంక్షేమ శాఖ అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. జిల్లా బీసీ సంక్షేమ అధికారి ప్రసాద్, మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీ వేమా, గుండుబోగుల పెద్దకాపు, ఎంపీపీ కేతా శ్రీనివాస్, గుబ్బల శ్రీనివాస్, సూరిశెట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ కలయికకు వేదిక వనసమారాధన

అంబాజీపేట: ఆత్మీయ కలయిక వేదికగా కార్తిక వనసమారాధనలు ఉపయోగపడతాయని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు, మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరిదేవి అన్నారు. మాచవరంలో కుమ్మర శాలివాహన సంఘ భవనం నందు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కుమ్మర శాలివాహన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కార్తిక వన సమారాధన కార్యక్రమాన్ని అధ్యక్షుడు మానేపల్లి వీరబ్రహ్మం అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఐలాపురపు వెంకయ్య, కుమ్మర శాలివాహన ఫెడరేషన్ మాజీ చైర్మన్‌లు తుగ్గలి నాగేంద్ర, మండేపూడి పురుషోత్తం ప్రసంగించారు. కవయిత్రి మొల్లమాంబ విగ్రహానికి రాష్ట్ర సమాచార మక్కు చట్టం మాజీ కమిషనర్ ఐలాపురపు రాజా పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి, సొసైటీ మాజీ అధ్యక్షుడు దొమ్మేటి సత్యమోహన్, దాలిపర్తి భీమేశ్వరరావు, శిరిగినీడి వెంకటేశ్వరరావు, బొంతు పెదబాబు, దాసరి వీరవెంకట సత్యనారాయణ, అరిగెల సూరిబాబు, ఆదుర్తి నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు


లక్కవరంలో గొల్లపల్లి సూర్యారావును సత్కరిస్తున్న యాదవ సంఘం సభ్యులు


కొత్తపేటలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి వేణు,


ఈదరాడ నుంచి సమ్మేళనానికి వెళ్లిన యెరుబండి కుటుంబీకులు

శెట్టిబలిజలు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలి

కొత్తపేట: ఆర్థికంగా వెనుకబడిన శెట్టిబలిజలు అన్ని రంగాల్లో రాణిస్తూ ఆర్థిక పురోభివృద్ధి సాధించాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, మాజీ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణు గోపాలకృష్ణ, శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మన్, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం (ఆర్ఎస్) పిలుపునిచ్చారు. పవిత్ర కార్తికమాసం సందర్భంగా ఆదివారం స్థానిక ఆర్ఎస్ బీసీ కన్వెన్షన్ హాలు ప్రాంగణంలో శెట్టిబలిజ కార్తిక వన సమారాధన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం(ఆర్ఎస్) ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో తొలుత ఆర్ఎస్– జిల్లా టీడీపీ అధ్యక్షురాలు రెడ్డి అనంతకుమారి దంపతులు ఉసిరిచెట్టు వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆర్ఎస్ అధ్యక్షతన జరిగిన సభలో మంత్రి సుభాష్, మాజీ మంత్రి చెల్లుబోయిన వేణు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. అనంతరం అందరూ వన భోజనాలు చేశారు. రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు, అవిడి సర్పంచ్ రెడ్డి చంటి, మండల సంఘం అధ్యక్షుడు కముజు వెంకటేశ్వరరావు, కార్యదర్శి గుబ్బల సత్తిపండు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రెడ్డి రామకృష్ణ, వైఎస్సార్ సీపీ నాయకుడు సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

పలివెల గ్రామంలో..

కొత్తపేట మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు యెండూరి పవన్‌కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం కార్తిక వన సమారాధన నిర్వహించారు. పలివెల గ్రామంలో మండల సంఘం కార్యదర్శి శ్రీఘాకోళ్లపు చినసుబ్బారాయుడు (చిన్ని) సోదరుల వ్యవసాయ క్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కంచర్ల వెంకట్రావు(బాబి) ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు.

శ్రీకృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో..

మలికిపురం: లక్కవరంలో ఆదివారం రాజోలు తాలూకా శ్రీకృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో కార్తిక వనసమారాధన నిర్వహించారు. రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, రాజోలు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి గొల్లపల్లి సూర్యారావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వీరిని యాదవ సంఘం కార్యవర్గ సభ్యులు శాలువాలతో సన్మానించారు. పలువురు ప్రముఖులు, సంఘ నాయకులు పాల్గొన్నారు.

వెదిరేశ్వరం శివారు కాశీరాజు తోటలో ..

రావులపాలెం: వెదిరేశ్వరం శివారు కాశీరాజు తోటలో ఆదివారం సత్తి వారి కార్తిక వనసమారాధన ఘనంగా నిర్వహించారు. తొలుత సత్తి వారి కుటుంబ సభ్యులు, ఆడపడుచులు ఉసిరిచెట్టు వద్ద నిర్వహించిన పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన డాన్సులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. అనంతరం పలు పోటీల్లో విజేతలకు కమిటీ సభ్యులు సత్తి వెంకట సత్యనారాయణరెడ్డి, సత్తి సూర్యభాస్కరరెడ్డి(చిన్నబుజ్జి), సత్తి శ్రీనివాసరెడ్డి, సీలింగ్ శ్రీనివాసరెడ్డి, ఉదయ భాస్కర్ రెడ్డిలు బహుమతులు అందజేశారు.

ఈదరాడలో 'యెరుబండి' సమ్మేళనం

మామిడికుదురు: ఆలమూరు మండలం బడుగువానిలంకలో కార్తిక మాసం సందర్భంగా ఆదివారం ఏర్పాటు చేసిన యెరుబండి కుటుంబ సభ్యులు వన సమారాధన ఉత్సాహంగా సాగింది. ఈ సమ్మేళనానికి ఈదరాడ నుంచి పయనమయ్యారు. ఈ సందర్భంగా యెరుబండి వారి ఐక్యత వర్ధిల్లాలి అంటూ యువకులు స్థానికంగా సందడి చేశారు. మూడవ వార్షికోత్సవంలో భాగంగా ఏర్పాటు చేసిన ఈ సమ్మేళనం వల్ల సుదూరంలో ఉన్న కుటుంబ సభ్యులంతా ఐక్యం అయ్యేందుకు ఈ సమ్మేళనం దొహదం చేస్తుందని స్థానికులు పేర్కొన్నారు.